క్లుప్తంగా

ఎల్‌వోసీ అందజేత



మోర్తాడ్: భీమ్‌గల్ మండలం నస్రీనా బేగం అనే మహిళ గుండె సంబంధిత వ్యాధితో బాధ పడుతూ శస్త్ర చికిత్స చేయించుకోగా.. వైద్య సాయం కోసం రూ.2.25లక్షల ఎల్‌వోసీని బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి ఆమె కుటుంబ సభ్యులకు అందజేశారు. సోమవారం వేల్పూర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో నస్రీనా బేగం కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే ఎల్‌వోసీని అందించారు.

బుద్దె రాజేశ్వర్ విగ్రహ ప్రతిష్ఠాపనకు విరాళం



బోధన్: సాలూర మండల కేంద్రానికి చెందిన బోధన్ తాజా మాజీ ఎంపీపీ బుద్దె సావిత్రి భర్త, సీనియర్ నేత దివంగత బుద్దె రాజేశ్వర్ విగ్రహ ప్రతిష్ఠాపనకు పార్టీలు, కులాలకతీతంగా గ్రామ శివారులోని అంతరాష్ట్ర బైపాస్ రోడ్డు ప్రక్కన ఏర్పాట్లు చేస్తున్నారు. గ్రామ ముదిరాజ్ కుల సంఘ సభ్యులు రూ.51 వేల నగదును విరాళంగా అందించారు. ఆ సంఘ గ్రామ ప్రతినిధులు మాట్లాడుతూ.. బుద్దె రాజేశ్వర్ తమ కుల సంఘ సభ్యులకు అందించిన సేవలు మరువలేనివని పేర్కొన్నారు.

పాఠశాలకు ఒక్క రోజు కూడా డుమ్మా కొట్టలేదు



డొంకేశ్వర్(ఆర్మూర్): పాఠశాలకు ఒక్క రోజు కూడా డుమ్మా కొట్టకుండా వెళ్లిన సుంకరి సహస్రను డొంకేశ్వర్ ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం సురేశ్ కుమార్ అభినందించారు. తొమ్మిదో తరగతి చదువుతున్న సహస్ర ఏడాదిలో ఒక్క రోజు కూడా సెలవు పెట్టకుండా తరగతులకు హాజరైంది. 218 రోజులు పాఠశాలకు వచ్చే విధంగా కృషి చేసిన సహస్రతో పాటు వారి తల్లిదండ్రులను అభినందించారు.

కట్నం కోసం వేధించిన అత్తింటివారిపై కేసు నమోదు

రుద్రూర్: వివాహితను కట్నం కోస ం వేధించిన అత్తింటివారిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై సునీల్ తెలిపారు. సుంకినికి చెందిన సంధ్యను ఆమె భర్త రాజేష్, అత్త గంగుబాయి, మామ బాలాజీ అదనపు కట్నం తీసుకురమ్మని వేధించేవారు. ఇంట్లో నుంచి పంపించివేయడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు కోటగిరి ఎస్సై తెలిపారు.

నిందితుడి అరెస్టు

రుద్రూర్: మండలంలోని బొప్పాపూర్ గ్రామంలో మూడు గడ్డివాములు దగ్ధం చేసిన నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఎస్సై సాయన్న సోమవారం తెలిపారు. బొప్పాపూర్ గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున ముగ్గురికి చెందిన గడ్డివాములు దగ్ధమయ్యాయి. ఈ ఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, అదే గ్రామానికి చెందిన ప్రవీణ్‌ను అరెస్ట్ చేశామన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

బాల్కొండ: ముప్కాల్ మండలం వేంపల్లిలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.5 లక్షలతో చేపడుతున్న సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను సోమవారం కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. మంజూరుకు కృషి చేసిన కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పీఏసీఎస్ చైర్మన్ జక్క రాజేశ్వర్ పాల్గొన్నారు.

సూత్రధారులెవరు.. పాత్రధారులెవరు..?

- దొరికింది రూ.7 వేలు.. ఏళ్ల తరబడి దోచింది ఎంత..?
- ఎస్ఈ బాబన్న హస్తంపై ఏసీబీ అధికారులు ఆరా తీసేనా..?
- బిల్లుల చెల్లింపులో పంచాయతీరాజ్ శాఖాధికారుల పర్సంటేజీల బాగోతం



ఆర్మూర్: స్థానిక పంచాయతీరాజ్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరింగ్ విభాగంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న ఎస్. శ్రీనివాస్ శరభేశ్వర శర్మ సీసీ రోడ్డు విషయంలో కాంట్రాక్టర్ నుంచి రూ.7 వేలు లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టు పడటం జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. పంచాయతీరాజ్ శాఖలో కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపులో అధికారులు పర్సంటేజీలు తీసుకొని పంచుకోవడం బహిరంగ రహస్యమే. అయితే ప్రస్తుతం క్షేత్ర స్థాయిలో లంచం తీసుకుంటూ శ్రీనివాస్ శర్మ పట్టుబడినప్పటికీ ఆ కాంట్రాక్టర్‌కు బకాయి ఉన్న రూ.4 లక్షల 75 వేలు చెల్లించాలి అంటే ఫండ్ ట్రాన్స్‌ఫర్ ఆర్డర్ (ఎఫ్‌టీవో)పై పంచాయతీరాజ్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్(ఈఈ) సంతకం చేయాల్సి ఉంటుంది. అయితే ఈ బిల్లు పాతది కావడంతో ఆ సమయంలో ఆర్మూర్‌లో ఈఈగా విధులు నిర్వహించిన బాబన్నతో ఎఫ్‌టీవోపై పాత డేట్లలో సంతకం చేయిస్తానంటూ శ్రీనివాస్ శర్మ మధ్యవర్తిగా రూ.7 వేల లంచం తీసుకుంటూ పట్టుబడ్డాడు. ప్రస్తుతం ఈఈ బాబన్న ఎస్ఈగా పదోన్నతి పొంది ఆర్మూర్ నుంచి వెళ్లిపోయి జిల్లా కేంద్రంలో విధులు నిర్వహిస్తున్నాడు. ఏసీబీ అధికారులకు ప్రాథమిక విచారణలో శ్రీనివాస్ శర్మ ఎఫ్‌టీవోపై పాత డేట్లలో ఎస్ఈ బాబన్నతో సంతకం చేయిస్తానంటూనే లంచం డిమాండ్ చేసిన విషయాన్ని తెలిపినట్లు ఏసీబీ డీఎస్పీ శేఖర్‌గౌడ్ వివరించారు. దీంతో శ్రీనివాస్ శర్మ పాత్రధారిగా కనపడుతున్న ఈ ఏసీబీ ట్రాప్‌లో సూత్రధారులపై సైతం పూర్తి విచారణ జరిపి చర్యలు తీసుకోవాలనే చర్చ సర్వత్రా వినిపిస్తోంది. ప్రభుత్వ కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు ఒకరికి ఒకరు ఫోన్లు చేసుకుంటూ ఇది నిజమేనా..? అంటూ ఆరాలు తీసుకుంటున్నారు.

ఎనిమిదేళ్లుగా ఆర్మూర్‌లోనే తిష్ట..

కాంట్రాక్టర్లతో పాటు తోటి ఉద్యోగులను సైతం వేధింపులకు గురి చేసే శ్రీనివాస్ శర్మ లంచాల కోసం బదిలీ, పదోన్నతి ఏదైనా ఎనిమిదేళ్లుగా ఆర్మూర్‌లో తిష్ట వేసిన తీరు ఆయన అక్రమార్జనకు అద్దం పడుతోంది. బాన్సువాడ పంచాయతీరాజ్ శాఖ సబ్ డివిజన్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా విధుల్లో చేరిన శ్రీనివాస్ శర్మ ఎనిమిదేళ్ల క్రితం ఆర్మూర్‌కు డిప్యూటేషన్‌పై వచ్చి ఐదేళ్లు ఇక్కడే విధులు నిర్వహించారు. ఐదేళ్ల అనంతరం ఇక్కడే కొనసాగడానికి నిబంధనలు అడ్డు రావడంతో డిపార్టుమెంట్‌ను మార్చి రెండు, మూడు నెలలు జిల్లా పరిషత్ కార్యాలయానికి బదిలీపై వెళ్లాడు. తిరిగి సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతిపై బాల్కొండ పంచాయతీరాజ్‌కు వచ్చినప్పటికీ మళ్లీ మూడేళ్ల క్రితం డిప్యుటేషన్‌పై ఆర్మూర్‌కు వచ్చి తిష్ట వేశాడు. ఆర్మూర్ ప్రాంతంలో పలు మార్లు ఏసీబీ అధికారులు దాడులు చేసి లంచాలు తీసుకుంటున్న అధికారులను, ఆదాయానికి మించిన ఆస్తులను కలిగి ఉన్న వారిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుంటున్నా ఈజీ మనీకి అలవాటు పడ్డ లంచగొండి అధికారుల తీరులో మాత్రం మార్పు రావడం లేదు.

తాగునీటి వృథాను అరికట్టండి



బెల్లాల్‌చెరువు వద్ద కాలువ తూమును పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ వికాస్ మహతో, అధికారులు

బోధన్ టౌన్(బోధన్): వేసవి కాలంలో తాగునీరు వృథా కాకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని సబ్‌కలెక్టర్ వికాస్ మహతో బల్దియా అధికారులకు సూచించారు. సోమవారం బెల్లాల్ చెరువును పరిశీలించారు. బెల్లాల్ చెరువులో నీటి నిల్వ వివరాలను కమిషనర్ వెంకట నారాయణను అడిగి తెలుసుకున్నారు. వేసవి కాలంలో పట్టణ ప్రజలు తాగునీటి ఇబ్బందులు పడకుండా చర్యలు చేపట్టాలని, పైప్ లైన్ లీకేజీలపై ప్రత్యేక దృష్టి సారించి లీకేజీలు ఉంటే తక్షణమే మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. మున్సిపల్ డీఈ యోగేష్, ఏఈ ఉన్నారు.

ఉపాధి హామీ కూలీల సమస్యలు పరిష్కరించాలి



ఎంపీడీవో శ్రీనివాసరావుకు వినతి పత్రం అందజేస్తున్న కార్మిక సంఘం నేతలు

నందిపేట్(ఆర్మూర్): ఉపాధి హామీ కూలీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నందిపేట ఎంపీడీవో శ్రీనివాసరావుకు వినతి పత్రం అందజేశారు. పనిచేస్తున్న ఉపాధి కూలీలకు పాత పద్ధతిలోనే పనులు కల్పించాలన్నారు. చెరువులో చేపల కోసం తవ్వుతున్న మట్టి గట్టిగా ఉండడం వల్ల కొలతలు లేకుండా కూలి ఇవ్వాలన్నారు. పని ప్రదేశంలో టెంట్, మంచినీటి సౌకర్యాన్ని ఏర్పాటు చేయాలన్నారు. నాయకులు కె.గంగాధర్, భూమన్న, దేవన్న, కోట దేవమ్మ, రాజమణి, కవిత, స్వప్న, సంగీత పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి సహకరించండి



విద్యార్థులతో ఉపాధ్యాయులు, ఎంఈవో

కమ్మర్‌పల్లి : నాణ్యమైన విద్యను అందించే ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎంఈవో ఆంధ్రయ్య కోరారు. హాసాకొత్తూరు ఉన్నత పాఠశాలలో సోమవారం ప్రభుత్వ పాఠశాలల సమ్మేళనం అనే ట్విన్నింగ్ కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆధునిక సైన్స్, కంప్యూటర్ ల్యాబ్‌లను ఎంఈవో ఆంధ్రయ్య, గ్రామ కమిటీ అధ్యక్షుడు సతీష్‌లు ప్రారంభించారు. అనంతరం పాఠశాలలో ప్రభుత్వం ద్వారా అందిస్తున్న సౌకర్యాలను విద్యార్థులకు చూపిస్తూ వారు అవగాహన కల్పించారు. నాణ్యమైన విద్యాబోధన ప్రభుత్వ పాఠశాలల్లోనే అందుతుందని, తల్లిదండ్రులు కూడా దీనిని గుర్తించి వారి పిల్లలని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించడం ద్వారా బలోపేతం చేయాలని అన్నారు.

న్యాయమూర్తులకు ఘనమైన వీడ్కోలు



బోధన్‌టౌన్(బోధన్): బోధన్ కోర్టులో ఇటీవల బదిలీ అయిన ఐదవ అదనపు న్యాయమూర్తి రవికుమార్, సీనియర్ సివిల్ న్యాయమూర్తి దేవన్ అజయ్ కుమార్‌లకు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా వీడ్కోలు పలికారు. బదిలీ అయిన న్యాయమూర్తులను ఘనంగా సన్మానించి మెమొంటోలు అందజేశారు. న్యాయమూర్తులు శ్రీనివాస్, సాయి శివ, శేషతల్ప సాయి, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి విద్యాసాగర్, ఉపాధ్యక్షులు వీఆర్ దేశాయ్, తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్ రజతోత్సవ సభకు తరలిరావాలి



కోటగిరిలో మాట్లాడుతున్న బాజిరెడ్డి గోవర్ధన్

రుద్రూర్/కోటగిరి: వరంగల్ పట్టణంలో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు పార్టీ కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో తరలిరావాలని మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ పిలుపునిచ్చారు. రుద్రూర్, కోటగిరి మండల కేంద్రాల్లో పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డికి ఎంతో ప్రాధాన్యం ఇస్తే పార్టీ కష్టాల్లో ఉన్నప్పుడు వెళ్లిపోయాడని, ఉప ఎన్నికల్లో పరాజయం తప్పదని అన్నారు. కోటగిరి మాజీ జెడ్పీటీసీ సులోచన, బాన్సువాడ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ జుబేర్, రుద్రూర్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి గాండ్ల మధు, నాయకులు షేక్ జుబేర్, జువ్వల శ్రవణ్, షేక్ హాజీ, సలీం, సమీర్, సాయిలు పాల్గొన్నారు.

సంక్షిప్తం

సకాలంలో యూనిఫామ్స్ అందజేయాలి



పెర్కిట్(ఆర్మూర్): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పాఠశాలలు పునఃప్రారంభమయ్యేలోపు యూనిఫామ్స్ అందజేయాలని ఆర్మూర్ మున్సిపల్ కమిషనర్ రాజు, ఎంపీడీవో సాయిరాం.. ఐకేపీ, మెప్మా సిబ్బందికి సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు వచ్చే విద్యా సంవత్సరానికి యూనిఫామ్స్‌ను కుట్టడానికి ఐకేపీ, మెప్మా సిబ్బందికి సోమవారం డ్రెస్ మెటీరియల్ అందజేశారు. ఎంఈవో రాజగంగారాం, మెప్మా కోఆర్డినేటర్ ఉదయశ్రీ, ఐకేపీ ఏపీఎం గంగారాం పాల్గొన్నారు.

స్కూల్ బ్యాగుల పంపిణీ

రుద్రూర్:సిద్ధాపూర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సోమవారం అనంతశ్రీ విభూషిత జగద్గురు రామానందచార్య ఆధ్వర్యంలో స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. హెచ్ఎం విఠల్‌రెడ్డి, టీచర్లు శ్రీలత, రజిత, పేరెంట్స్ కమిటీ సభ్యులు అనిత, సంగీత, జయశ్రీ, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్..



కమ్మర్‌పల్లి: కోనాపూర్ జెడ్పీహెచ్ఎస్‌లో సోమవారం పదో తరగతి విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. హెచ్ఎం రాంప్రసాద్ మాట్లాడుతూ.. పదో తరగతి తర్వాత పాలిటెక్నిక్ కళాశాలలో చేరడం ద్వారా మూడేళ్లలో ఇంజనీరింగ్ డిప్లొమా కోర్సు పూర్తి కావడంతో పాటు, ఉపాధి పొందవచ్చని లేదా ఇంజనీరింగ్ రెండో సంవత్సరంలో చేరవచ్చన్నారు. పాలిటెక్నిక్ కోర్సు ప్రవేశ పరీక్ష కోసం స్టడీ మెటీరియల్‌ను అందజేశారు.

బాలిక అదృశ్యం

రుద్రూర్: పొతంగల్ మండలం హంగర్గ గ్రామానికి చెందిన బాలిక(15) నాలుగు రోజులుగా కనిపించడం లేదని ఎస్సై సునీల్ తెలిపారు. ఈ నెల 18న ఇంట్లో నుంచి వెళ్లిన బాలిక తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభించలేదు. సోమవారం బాలిక తల్లి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

ధాన్యం కొనుగోలు చేయడం లేదని ఆందోళన



అంబం(వై)లో నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

ఎడపల్లి(బోధన్): అంబం(వై) గ్రామ రైతులకు చెందిన వరి ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రం వారు కొనుగోలు చేయడం లేదని పలువురు రైతులు సోమవారం గ్రామంలో ఆందోళన చేశారు. బోధన్ మండలం పెగడాపల్లి సింగిల్ విండో పరిధిలో అంబం గ్రామం ఉంది. ప్రతి ఏటా ఈ గ్రామ రైతుల ధాన్యం ఈ సింగిల్ విండో ద్వారానే కొనుగోలు చేసేవారు. ఈ సారి కూడా ఈ గ్రామ రైతుల ధాన్యాన్ని సింగిల్ విండో వారు కొనుగోలు చేస్తున్నారు. అయితే గ్రామంలోని కొంత మంది రైతుల ధాన్యం కొనుగోలు చేసి, మరికొంత మంది రైతుల ధాన్యం కొనుగోలు చేయడంలో నిర్లక్ష్యం చూపుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఇదేమని అడిగితే అంతా మాఇష్టం అంటున్నారని, ఓపిక వుంటే ఆగండి లేదంటే మీ ఇష్టం వచ్చిన దగ్గర అమ్ముకోమని తమపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. సింగిల్ విండో కార్యదర్శి, చైర్మన్ సైతం రైతుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తూ, ప్రైవేటుకు అమ్ముకొమ్మని ఉచిత సలహాలు ఇస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి ధాన్యం కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. రైతులు సున్నపు ఒడ్డెన్న, జుట్టు హరిక్రిష్ణ, సున్నపు లక్ష్మయ్య, కొండెంగల సుదర్శన్, అల్లపు రమేష్ తదితరులు ఉన్నారు.

నీటి ఎద్దడి రాకుండా చూసుకోవాలి



గగ్గుపల్లిలో బోరు బావులను పరిశీలిస్తున్న ఎంపీడీవో గంగాధర్

పెర్కిట్(ఆర్మూర్): వేసవిలో నీటి ఎద్దడి రాకుండా చూసుకోవాలని ఆలూర్ ఎంపీడీవో గంగాధర్ జీపీ కార్యదర్శులకు సూచించారు. ఆలూర్ మండలం గగ్గుపల్లిలో సోమవారం ఎంపీడీవో నీటి ట్యాంకులు, బోరు బావులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీకి సంబంధించిన బోరు బావుల పనితీరును ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పర్యవేక్షణ కొనసాగాలన్నారు.

కొనసాగిన అఖండ శివనామ సప్తాహం



ప్రవచనాలు చేస్తున్న సద్గురు సిద్ధదయాళ్ శివాచార్య మహరాజ్

బోధన్ : వీరశైవ సమాజ్(వీరశైవ లింగాయత్, జంగమ సమాజ్ ఉమ్మడిగా) బోధన్ శాఖ ఆధ్వర్యంలో పట్టణ కేంద్రంలోని ఏకచక్రేశ్వరాలయంలో ఏర్పాటు చేసిన 20వ అఖండ శివ నామ సప్తాహం కొనసాగింది. సోమవారం సప్తాహం రెండో రోజు ఉదయం నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శిబిరంలో మహిళలు, భక్తులు శివనామ సంకీర్తన, పరమ రహస్య గ్రంథ సామూహిక పారాయణం చేశారు.

శిబిరంలో మహారాష్ట్ర ప్రాంత బేట్‌మోగ్రా వీరశైవ మఠాధిపతి సద్గురు సిద్ధ దయాళ్ శివాచార్య మహరాజ్ భక్తుల నుద్దేశించి ప్రవచనాలు చేశారు. తల్లిదండ్రులు, గురువులను గౌరవించాలని, నిత్యం శివనామస్మరణ చేయడం మరువొద్దని మఠాధిపతి ప్రబోధించారు. వీరశైవ ధర్మ సాహిత్యాన్ని అధ్యయనం చేయాలన్నారు.

ముప్పై మూడేళ్ల తర్వాత ఆత్మీయ సమ్మేళనం



ఎరాజ్‌పల్లి జెడ్పీహెచ్ఎస్ 7వ తరగతి పూర్వ విద్యార్థులు

ఎరాజ్‌పల్లి జెడ్పీహెచ్ఎస్‌లో 1992–93 విద్యా సంవత్సరం 7వ తరగతి బ్యాచ్ విద్యార్థులు సోమవారం ఆ గ్రామంలో తోటి పూర్వ విద్యార్థి చంద్రకాంత్‌రెడ్డి నివాసంలో ఆత్మీయ సమ్మేళనం అయ్యారు. 33 ఏళ్ల సుదీర్ఘకాలం తర్వాత ఒకే చోట కలిసి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాల నాటి తీపి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు.

– బోధన్

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించండి



పోచంపల్లిలో గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న అంక్సాపూర్ స్కూల్ టీచర్లు



కొత్తపల్లిలో ..

వేల్పూర్/బాల్కొండ/పెర్కిట్ : ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల్ని చేర్పించండంటూ ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు సోమవారం వేల్పూర్ మండలం పోచంపల్లిలో, ముప్కాల్ మండలం కొత్తపల్లిలో, ఆర్మూర్ మండలం సుర్బిర్యాల్‌లో బడి బాట కార్యక్రమం చేపట్టారు. గ్రామస్తులతో, ఉపాధి హామీ కూలీలతో సమావేశమై ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యా బోధన, సౌకర్యాల గురించి వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రయివేటు పాఠశాలలకు ధీటుగా బోధన ఉందన్నారు. మధ్యాహ్న భోజనంతో పాటు పుస్తకాలు, నోట్ బుక్స్ ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు.

సినిమాలు

పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

స్క్రీన్-1	మ్యాడ్‌స్క్వేర్(తెలుగు)-11.10, 7.45, మధురం-1.55 జాక్(తెలుగు) 4.50, డియర్ ఉమ-10.30
స్క్రీన్-2	ఓదెల-2-10.00, 1.05, 4.10, 7.15, 10.20
స్క్రీన్-3	జాక్(తెలుగు)-11.15, 8.40 మ్యాడ్ స్క్వేర్(తెలుగు)-2.10, 5.10
స్క్రీన్-4	అర్జున్ సన్ ఆఫ్ వైజయంతి-10.30, 1.30, 4.30, 7.30,10.30



మాంసం ధరలు (రూ..)

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్స్‌డ్	200
		లైవ్	140
స్కిన్‌లెస్	240	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	97,400	వెండి(కిలో)	1,02,000
22 క్యారెట్స్	89,910		

– నిజామాబాద్ బిజినెస్

పౌష్టికాహారాన్ని తీసుకోవాలి

సాక్షి నెట్‌వర్క్: మహిళలు, చిన్నారులు పోషకాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ అధికారులు సూచించారు. సోమవారం రుద్రూర్, పొతంగల్, నవీపేట, బాల్కొండ, రెంజల్ మండలాల పరిధిలో పోషణ్ పక్వాడ్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ..ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న బాలామృతం తల్లీపిల్లల ఆరోగ్యానికి మంచిదన్నారు. సమతుల్య ఆహారం అందించే లక్ష్యంతో అంగన్‌వాడీ కేంద్రాలు పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. టీచర్లతో పాటు ఆశ కార్యకర్తలు ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల పెంపునకు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. తల్లి పాలే బిడ్డకు శ్రేయస్కరమన్నారు. పలు చోట్ల గర్భిణులకు సీమంతం నిర్వహించారు. చిన్నారులకు అన్నప్రాశన, అక్షరాభ్యాసం చేయించారు.



రుద్రూర్‌లో వివరిస్తున్న హెచ్ఈవో శ్రీనివాస్



నవీపేటలో చిన్నారులతో అధికారులు



వన్నెల్(బి)లో సీమంతం చేస్తున్న అధికారులు



రెంజల్‌లో మాట్లాడుతున్న సీడీపీవో పద్మజ



పొతంగల్‌లో గర్భిణులకు సీమంతం

సమాచారం..

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బాల్కొండ: చిట్టాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ కిషన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నేపథ్యంలో చిట్టాపూర్, శ్రీరాంపూర్ గ్రా మాల్లో ఉదయం 8 గంటల నుంచి 11వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలో నూతన బార్ కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ అంజిత్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన వారు నూతన బార్ కోసం రూ.లక్ష డీడీ తీసీ ఈ నెల 26 వరకు దరఖాస్తులు ఆర్మూర్ ఎక్సైజ్, జిల్లా ఎక్సైజ్ కార్యాలయంలో ఇవ్వాలన్నారు. ఈనెల 29న డ్రా తీయనున్నట్లు తెలిపారు.

రేపు అయ్యప్ప స్వామి ఆలయ 29వ వార్షికోత్సవం

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని భీముని గుట్ట ఆలయ ఆవరణలో గల అ య్యప్ప స్వామి ఆలయ 29వ వార్షికోత్సవం బుధవారం నిర్వహించనున్నట్లు అయ్యప్ప సేవా ట్రస్ట్ అధ్యక్షుడు శివన్నారాయణ తెలిపారు. ఉదయం 5.45 గంటలకు సుప్రభాత సేవ మొదలు ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు.